పచ్చి రొయ్యలు
Sea Shrimp
Sea food.. Salmon, Tuna, Cod, Tilapia, Snapper, Shrimp, Lobster, Crab available
linga frozen food, bhatti savargav road, adilabad.
cell: 93813 43925

ఈకాలం వార్త
THE HONEST TELUGU DAILY

సముద్రపు చేపలు
Sea Fish
Sea food.. Salmon, Tuna, Cod, Tilapia, Snapper, Shrimp, Lobster, Crab available
linga frozen food, bhatti savargav road, adilabad.
cell: 93813 43925

మంగళవారం 31-03-2026 | పేజీలు : 4 | వెల రు : 2/- | సంపుటి : 1 సంచిక :152 | ప్రచురణ: తెలంగాణ | ఎడిటర్ : దేవేందర్ నూకల

# ఆహార కల్తీ నియంత్రణ
# సరికొత్త వ్యవస్థ



- ఈగల్, హైడ్రా తరహాలో ఏర్పాటు ఆలోచన
- నిత్యావసరాలు అక్రమ నిల్వ చేస్తే కఠిన చర్యలు
- సన్నబియ్యం పంపిణీతో బ్లాక్ మార్కెట్ తగ్గింది
- వాణిజ్య పంటలవైపు రైతులను ప్రోత్సహిస్తున్నాం
- త్వరలోనే ప్రజలకు క్యాన్సర్ టెస్టుల నిర్వహణ
- 50 శాతం సీట్లు పెంపు వెనక పెద్ద కుట్ర
- దక్షిణభారతదేశానికి తీవ్ర అన్యాయం చేసే ఎత్తుగడ
- దీనికోసం బిజెపి లక్ష్మణ రాజీనామా చేయాలి
- కెసిఆర్ వల్లనే తనకు మంచి పేరు వస్తోంది
- మీడియా చిట్‌చాట్‌లో సిఎం రేవంత్ రెడ్డి

ఈగల్, హైడ్రా తరహాలో ఆహార కల్తీ నియంత్రణకు సరికొత్త వ్యవస్థను తీసుకొస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలో చట్టాలను అధ్యయనం చేసి పకడ్బందీ వ్యవస్థను రూపొందిస్తామన్నారు. మరోవైపు పంటకు ధర నిర్ణయించే అవకాశం రైతుకు లేకుండా పోయిందని, వారి అవసరాలను ఆసరాగా చేసుకొని దళారులు దోపిడీ చేస్తున్నారని సీఎం వ్యాఖ్యానించారు. రైతుల హక్కులను కాపాడేందుకు కనీస మద్దతు ధర చట్టం తీసుకొచ్చినట్లు గుర్తు చేశారు. సోమవారం ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. నిత్యావసరాలను అక్రమంగా నిల్వ ఉంచడం హత్యానేరం కంటే ఎక్కువే. ప్రజలకు దొడ్డుబియ్యం ఇవ్వడం వల్ల ప్రయోజనం లేదని గ్రహించాం. 86 శాతం ప్రజలు సన్నబియ్యం పొందుతున్నారు. అర్హులందరికీ రేషన్‌కార్డు ఇచ్చాం. రైతులకు లాభం చేకూర్చడమే కాదు.. పేదల ఆకలి తీరుస్తున్నాం. సన్నబియ్యం పంపిణీతో బ్లాక్ మార్కెట్ మాఫియా తగ్గింది. వాణిజ్య పంటలవైపు రైతులను ప్రోత్సహిస్తున్నాం అని అన్నారు. పంట మార్పిడి విషయంలో రైతులపై ఒత్తిడి తీసుకురామని.. వారికి అవగాహన కల్పిస్తామని తెలిపారు. పేదలకు ఇచ్చే సన్న బియ్యం కోసం రూ. 14,560 కోట్లు ఖర్చు పెడుతున్నామని, దాంట్లో కోతలు పెట్టమని స్పష్టం చేశారు. సన్న బియ్యం పక్కదారి పట్టడం లేదని తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సన్న బియ్యంతో అసెంబ్లీలో అందరికీ మంచి భోజనం పెట్టారన్నారు.

2లో

విశాఖ యువతి

## మౌనిక హత్య

ఒళ్లు గగుర్పొడిచే నిజాలు

మౌనికను కిరాతకంగా చంపేసి..

రక్తపు వాసన రాకుండా సెంటు కొట్టి..



2లో..

## సహజీవన జంటలకు కుటుంబ హోదా:

జనగణనపై కేంద్రం



## ముంచుకొస్తున్న మంచినీటి సమస్య !



## ఏపీ, తెలంగాణ

### ఇంటర్ ఫలితాలు ఎప్పుడంటే?



- తెలుగు రాష్ట్రాల్లో ఇంటర్ ఫలితాలను వీలైనంత త్వరగా విడుదల చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.



తెలుగు రాష్ట్రాల్లో ఇంటర్ ఫలితాలను వీలైనంత త్వరగా విడుదల చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఏప్రిల్ రెండో వారం లోగా ఈ ఫలితాలను ప్రకటించే దిశగా రంగం సిద్ధం చేస్తున్నారు. తెలంగాణలో ఇప్పటికే పరీక్షలు పూర్తయి మూల్యాంకనం మొదలు కాగా.. ఏపీలో ప్రధాన పరీక్షలు బుధవారంతో ముగిశాయి. ఈ నేపథ్యంలో మార్చి 21 నుంచి ఏపీలో జవాబుపత్రాల మూల్యాకనం మొదలుకానున్నట్లు ఏపీ ఇంటర్ బోర్డు కార్యదర్శి రంజిత్ బాషా తెలిపారు.

# చివరి ధాన్యం గింజ వరకు కొంటాం



- 8గంటల్లోనే రైతుల ఖాతాల్లోకి డబ్బులు
- కోవ్వూరు మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రం
- ఎమ్మెల్యే ప్రశాంతితో కలిసి పరిశీలించిన మంత్రి నాదెండ్ల

చివరి ధాన్యం గింజ వరకు కొనుగోలు చేస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ధాన్యం అమ్మిన ఎనిమిది గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు పడేలా చూస్తున్నామని మంత్రి అన్నారు. క్షేత్రస్థాయిలోనూ రైతులు.. డబ్బులు వేగంగా పడుతున్నాయని చెప్పడం ఆనందంగా ఉందని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో ప్రత్యేకంగా కల్లాలు ఏర్పాటు చేస్తామని ఆయన ప్రకటించారు. నెల్లూరు జిల్లా సాగు చాలా ప్రత్యేకమైనదని మంత్రి అన్నారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే 40 నుంచి 60 రోజులు ఆలస్యంగా దిగుబడి వచ్చే ప్రాంతమిది అని చెప్పుకొచ్చారు. సోమవారం ఉదయం కోవూరు మండలం ఇనమడుగులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పరిశీలించారు.

2లో..




ఎండలు ముదురుతున్నాయి. ఇప్పుడే 40 డిగ్రీలకు చేరువలో ఉన్నాం. రానున్న రెండు నెలలు దారుణంగా ఉండే పరిస్థితులు కానవస్తున్నాయి. వాతావరణశాఖ కూడా ఇదే హెచ్చరిక చేస్తోంది. పశ్చిమాసియా యుద్ధం వల్ల వాతావరణంలో వేడి పెరిగిందని కూడా ఆందోళన వస్తోంది. అయితే ఇది ఎంతవరకు నిజమన్నది పక్కన పెడితే ఎండలు మాత్రం ముదురుతున్నాయి. ఇప్పటికే వేసవి మొదలు కావడంతో దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో తాగునీటి కొరత తీవ్రమైంది. 2030 నాటికి దేశంలోని 21 ప్రధాన నగరాల్లో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటే ప్రమాదం వుందని గణాంకాలు చెబుతున్నాయి. పర్యావరణ విధ్వంసం కూడా దీనికి ప్రధాన కారణం. మనం భూగర్భ జలాలను, నీటి వనరులను కోల్పోవడమే కాదు, ఉన్న నీటిని కూడా విషపూరితం చేస్తున్నామని అనేక నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. స్వచ్ఛమైన నీరు అందించడం ప్రభుత్వాల బాధ్యత. ప్రజల ప్రాథమిక హక్కులను కూడా కాపాడలేని పరిస్థితిలో ప్రభుత్వాలున్నాయి. దేశంలో ఏటా 3.77 కోట్ల మంది కలుషిత నీటి వల్ల వ్యాధుల బారిన పడుతున్నారు. డయేరియా వంటి వ్యాధులతో ప్రాణాలు కోల్పోతున్నారు.

## ఆళ్లకు హైకోర్టులో చుక్కెదురు



**మూడు పిటిషన్లు కొట్టివేసిన హైకోర్టు**

ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో వైసీపీ నేత, మంగళగిరి మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి దాఖలు చేసిన మూడు పిటిషన్లను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. ఇన్నర్ రింగ్ రోడ్డు కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని, విజయవాడ ఏసీబీ కోర్టు నుంచి ఎంపీ, ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టుకు కేసును బదిలీ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని వైసీపీ నేత పిటిషన్ వేశారు.

# సంపాదకీయం

## ఇద్దరు విప్లవ రచయితలు, ఆ ఇద్దరి 'తల్లులు'

సాహితీలోకంపై చెరగని ముద్ర వేసిన అద్భుత రచయితల్లో ఒకరు మహాశ్వేతాదేవి. ఎక్కువగా బెంగాలీలో ఆమె చేసిన రచనలు, ముఖ్యంగా నవలలు ఎన్నో భాషల్లోకి అనువాదమయ్యాయి. ఆమె ప్రఖ్యాత నవల 'హజార్ చౌరాషిర్ మా' 1983లో 'ఒక తల్లి' పేరుతో తెలుగు పాఠకులకు పరిచయమైంది. విప్లవం గురించి, బిడ్డలను కోల్పోయిన తల్లుల దుఃఖం గురించి తెలుగు పాఠకులకు ఒక కొత్త స్పృహను కలిగించిన నవల అది. ప్రతి విప్లవకారిణి వెనుక ఒక తల్లి ఉంటుందని, కానీ తరచూ ఆమె భావోద్వేగాలకు చోటు దక్కకుండా పోతోందన్న వాస్తవాన్ని అందులో మహాశ్వేత అసాధారణ నైతికధృతితో ప్రకటిస్తారు.

ఈ నవల ఒక కల్లోలభరితమైన రాజకీయ సందర్భంలో తెలుగులోకి వచ్చింది. అప్పటికే నక్సల్బరీ, శ్రీకాకుళ ఉద్యమాలు హింసాత్మక అణచివేతకు గురయ్యాయి. అయినప్పటికీ తెలుగునాట తిరుగుబాటు అగ్నికణాలు పూర్తిగా చల్లారలేదు. విప్లవకారులు పునస్సంఘటితమయ్యే పనిలో పడ్డారు. భూమి సమస్యతో పాటు వివిధ రూపాల దోపిడిపీడనలపై ఉద్యమాలు రాజుకోసాగాయి. అలాంటి ఉద్విగ్నమైన చారిత్రక సన్నివేశంలో వచ్చిన 'ఒక తల్లి' నవల పాఠకులకు ఒక కొత్త నైతిక సమర్థనను అందించింది. అది విప్లవకారుల త్యాగాలతో పాటు, వారి తల్లులు అనుభవించే మూగవేదనను మన ఉమ్మడి ఎరుకలోకి తీసుకొచ్చింది.

ఈ నవల తెలుగులో రావడానికి పదమూడేళ్ల ముందు తెలుగు నేలపై మరో రచయిత రేణుక జన్మించారు. ఆమె స్వగ్రామం కడవెండి. 1940ల్లో ఉమ్మడి కమ్యూనిస్ట్ పార్టీ నేతృత్వంలో జరిగిన తెలంగాణ రైతాంగ పోరాటంతో పెనవేసుకుపోయిన గ్రామం. భూస్వామ్య దోపిడీ, అణచివేతలకు వ్యతిరేకంగా పోరాడే చైతన్యం ఆనాటి నుంచే అలవర్చుకున్న గ్రామం. అలాంటి వాతావరణంలో, ఒక కొత్త తరం మరో దశ ఉద్యమాలకు నాంది పలుకుతున్న కాలంలో పుట్టిపెరిగిన రేణుక, టీనేజర్‌గా ఉన్నప్పుడే మహాశ్వేతాదేవి 'ఒక తల్లి' నవలను చదివారు. అందుకే ఆమెకు అందులోని అంశాలేవీ అమూర్తమైనవిగా, దూరంలో ఉన్నవిగా అనిపించలేదు.

రేణుక ఆ తర్వాతి కాలంలో రచయితగా ఎదిగి మహాశ్వేత ఒరవడిని ఒడిసి పట్టుకున్నారు. భూమి కోసం, అడవిపై హక్కు కోసం, న్యాయం కోసం, ఆత్మగౌరవం కోసం పోరాడేవాళ్లందరికీ గొంతుక అవుతూ, మహాశ్వేత మార్గాన్ని అనుసరించారు. తర్వాతి కాలంలో 'మిడ్కో' అనే కలంపేరుతో ప్రఖ్యాతి గాంచిన రేణుక మహిళలపై అణచివేత, వివక్షలతో మొదలై అన్ని రకాల దోపిడీపీడనలకు వ్యతిరేకంగా రాయడం మొదలుపెట్టారు. అంతేకాదు, వాటికి వ్యతిరేకంగా జరిగే ఉద్యమాలలో భాగమయ్యారు. అందుకే, రేణుక కథల్లోనైనా, ఇతర రచనల్లోనైనా పరిశీలకురాలిలా రాసినట్టు అనిపించదు. ప్రత్యక్ష అనుభవాలతో చేసిన గాఢమైన అల్లిక కనిపిస్తుంది.

మహాశ్వేత నవలలో కనిపించే భావోద్వేగ, రాజకీయ ధ్వనులన్నీ రేణుక ఒడిసిపట్టుకున్నట్టు అనిపిస్తుంది. అయితే, ఆమె మహాశ్వేతను అనుకరించలేదు. దానికి బదులు, ఆ సంప్రదాయాన్ని ఆమె మరింత విశాలమైన కాన్వాస్‌పైకి విస్తరించారు. తెలంగాణ మైదానాల్లో, దండకారణ్యం ఆదివాసీ పల్లెల్లో నివసించే తల్లుల దుఃఖానికి, సంఘర్షణకు ఆమె అక్షరరూపం ఇచ్చారు. అయితే, రేణుక రచనల్లోని తల్లులు విప్లవానికి సాక్షులు మాత్రమే కాదు, వేర్వేరు రూపాల్లో అందులో భాగస్వాములు కూడా.

మహాశ్వేత 'ఒక తల్లి' నవలనూ, రేణుక 'ఇద్దరు తల్లులు' కథనూ పోల్చి చూస్తే-- 'ఒక తల్లి'లో కథంతా సుజాత అనే తల్లి పాత్ర చుట్టూ తిరుగుతుంది. శవాలగదిలో 1084 నెంబర్ వేసి ఉన్న 'గుర్తు తెలియని' శవం తన కొడుకు 'బ్రతి'దిగా గుర్తించడంతో కథ మొదలవుతుంది. ఆనాడు బెంగాల్‌లో రాజ్యం చేతిలో హతులైన వేలాదిమంది యువ విప్లవకారుల్లో బ్రతి ఒకరు. తన కొడుకు జీవించిన, స్వప్నించిన ప్రపంచాన్ని క్రమంగా అర్థం చేసుకోవడం మొదలుపెట్టిన సుజాతలో ఒక బాధాకరమైన గ్రహింపు, చైతన్యం కలుగుతాయి. అదంతా తన మధ్యతరగతి జీవితానికి దూరంగా.. అన్యాయాలు, అణిచివేతలతో నిండిన ప్రపంచమని బోధపడుతుంది. విప్లవ సాహిత్యంలో కథావస్తువు కేంద్ర స్థానాన్ని బదిలీ చేయడం ఈ నవల విశిష్టతగా చెప్పుకోవచ్చు. విప్లవకారుడైన హీరో పాత్రకు బదులు, కథనాన్ని ఆమె తల్లిపాత్ర చుట్టూ అల్లుతారు. తన దుఃఖంలోంచే తన కొడుకు జీవితానికీ, స్వచ్ఛందంగా ఎంచుకున్న మృత్యువుకూ కారణమైన రాజకీయ వాస్తవాలను సుజాత తెలుసుకుంటుంది. క్రమంగా ఎదిరించడం కూడా మొదలుపెడుతుంది.రేణుక కథల్లో కూడా ఇలాంటి భావోద్వేగ ప్రపంచమే కనిపిస్తుంది. అయితే ఒక ముఖ్యమైన తేడా ఉంది. ఆమె కథల్లోని తల్లులు విప్లవాన్ని ఒక విషాదంలోంచి, లేదా బయటి నుంచి కనుగొనేవాళ్లు కాదు. దానికి భిన్నంగా, వారందరూ విప్లవోద్యమానికి ప్రాతిపదికగా ఉన్న సామాజిక పునాదుల్లో ముందు నుంచే జీవిస్తూ ఉండే మహిళలు.ఉదాహరణకు, రేణుక రాసిన 'ఇద్దరు తల్లులు' కథలో అడివమ్మ అనే ఒక గ్రామీణ దళిత మహిళ రోజూ ఒక టీచరు ఇంటికి వెళ్లి, పోలీస్ ఎన్‌కౌంటర్ల వార్తలు తెలుసుకుంటూ ఉంటుంది. మృతుల్లో తన కొడుకు లేడని తెలిసినా కూడా, ఆమె ఊరట చెందదు. 'ఎవరైతే ఏందమ్మా, ఏ తల్లులో కన్నబిడ్డలే గద, ఏ తల్లుల కడుపులు కాలినయో... కడుపుతీపి ఎవలకైన వొక్కటేగద, పంతులమ్మ?' అంటుంది. ఈ ఒక్క వాక్యంలో మహాశ్వేత, రేణుకల మధ్య ఒక అద్భుతమైన భావోద్వేగ వారధి కనిపిస్తుంది. 'మహాశ్వేత సుజాత' తన కొడుకు సహచరుల్లో మానవీయ కోణాలను గుర్తించినట్టుగా, 'రేణుక అడివమ్మ'కు కూడా నేలరాలిన విప్లవకారులందరూ తనలాంటి తల్లుల బిడ్డలుగా తోస్తారు.మహాశ్వేత 'ఒక తల్లి' నవలలో మార్చురీలో విప్లవకారుల గుర్తు తెలియని మృతదేహాలు పడి ఉన్న వర్ణన మనసును మెలిపెడుతుంది. రాజ్యం వాటికి గుర్తింపు లేకుండా చేయాలని ప్రయత్నిస్తే, దాన్ని నిలబెట్టుకునేందుకు తల్లి పడే ఘర్షణ, వేదన అందులో ఉంటాయి. రేణుక రాసిన 'ఆమె నా బిడ్డనే' కథలో కూడా ఇలాంటిదే ఉంటుంది. ఓ మారుమూల అడవిలో ఎన్‌కౌంటర్‌లో మరణించిన విప్లవకారుల శవాలు సమీప పట్టణంలోని హాస్పిటల్‌లో పడి ఉంటాయి. వాటిలో ఒక మృతదేహం తన బిడ్డదేనని ఒక ఆదివాసీ వృద్ధురాలు అధికారులతో వాదిస్తుంది. ఆమె ఆ శవాన్ని నిజంగానే గుర్తుపట్టిందా, లేదా అనేది అక్కడ అప్రస్తుతమవుతుంది. మృతులెవ్వరూ పేర్లు లేని అనాథ శవాలుగా మిగిలిపోవద్దనే ఆరాటం ఒక్కటే ఆ తల్లిలో కనిపిస్తుంది. ఏ విప్లవకారిణినైనా తన బిడ్డగా ప్రకటించే ఔన్నత్యం ఆమెలో ఆవిష్కృతమవుతుంది. రాజ్యహింస ఫలితంగా వ్యక్తిగత దుఃఖం సమిష్టి దుఃఖతో కలగలిసిపోయే సన్నివేశం ఇది.రేణుక మరో కథ 'ఆ రాజకీయాలు నాగ్గావాలె'లో మాతృత్వంపై ఆమె అన్వేషణ మరింత లోతుగా, గాఢంగా జరిగినట్టు కనిపిస్తుంది. ఈ కథంతా వెంకటమ్మ అనే నిరుపేద గ్రామీణ మహిళ ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన తన కొడుకు కొమురయ్య స్తూపాన్ని కట్టుకునేందుకు చేసే పోరాటం చుట్టూ నడుస్తుంది. ఇందులో మొదట వ్యక్తిగతమైందిగా మొదలయ్యే తల్లి దుఃఖం క్రమంగా రాజకీయమైందిగా మారుతుంది. పోలీసులు కొడుకు స్తూపాన్ని కూలగొట్టి ఆమె నోరు మూయించాలని ప్రయత్నిస్తారు. కానీ ఆమె తన కొడుకు స్మృతి చెదిరిపోనివ్వడాన్ని ఒప్పుకోదు. చివరకు స్తూపం కట్టాక, ఆవిష్కరణ సభలో ఆమె ఇలా అంటుంది -- "పలక మీద గీసిన గీతలైతే తుడిపెయ్యొచ్చు. కానీ మనుషులు అట్ల తుడిపేస్తే పోతరా, అయ్యా?" అంతే కాదు -- "మనుషులను తలుసుకునేదే రాజకీయమైతే ఆ రాజకీయాలు నాగ్గావాలె" అంటుంది.రేణుక మరో కథ 'ఈ శోకం ఎందరిది'లో కమలమ్మ అనే తల్లి దుఃఖాగ్రహం ఉమ్మడి విషాదంగా రూపాంతరం చెందే తీరు మనల్ని ఆశ్చర్యపరుస్తుంది. ఎన్‌కౌంటర్‌లో తన కొడుకు చనిపోయాడని విని, ఎంతో దుఃఖభారంతో ప్రయాణించి, పొరుగు రాష్ట్రంలోని ఒక హాస్పిటల్‌కు ఆమె చేరుకుంటుంది. కానీ అక్కడ, చనిపోయింది తన కొడుకు కాదని, ఒక గుర్తు తెలియని యువతి అని తెలిసినా ఆమె దుఃఖం ఆగదు. "అయ్యో బిడ్డా! ఏ తల్లి కన్నదో నిన్ను. ఇయ్యాల నన్ను ఏడిపించినవ్. కడుపు కోతంటే ఏందో తెలువ జెప్పినవ్. నా కడుపుల పుట్టిన బిడ్డ లెక్కనే అనిపిస్తున్నవ్, బిడ్డా" అంటూ కొనసాగే ఆమె విలాపం సామూహిక ధిక్కారంలా ధ్వనిస్తుంది.

మహాశ్వేతాదేవి 'ఒకతల్లి' నవలలో సుజాత పాత్రలో కలిగిన చైతన్యం తన కొడుకు జీవితపు రాజకీయ సారాన్ని అర్థం చేసుకునేందుకు దారి తీస్తుంది. రేణుక కథల్లో

# ఆహార కల్తీ నియంత్రణ సరికొత్త వ్యవస్థ

పేదలందరికీ ప్రభుత్వ పథకాలు కచ్చితంగా అందుతాయని పేర్కొన్నారు ముఖ్యమంత్రి. వరి వేస్తే ఉరే అని కేసీఆర్ అన్నారని.. తాము మాత్రం వరి వేస్తే బోనస్ ఇస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా 50 శాతం సీట్లు పెంచితే.. దక్షిణభారతదేశానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని పునరుద్ఘాటించారు. దక్షిణాదిపై ఉత్తరాది ఆధిపత్యం చెలాయిస్తుంది. దక్షిణాదిలో ఒక్క సీటు రాకున్నా కేంద్రంలో సర్కారు ఏర్పాటు చేసుకోవచ్చు. రాష్ట్రాల సీట్ల మధ్య అంతరం.. పెంచిన తర్వాత కూడా అంతే ఉండాలి. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ పార్టీల సమస్య కాదు. 50శాతం సీట్ల పెంపుపై విస్తృతంగా చర్చ జరగాలన్నారు. పార్టీలకు అతీతంగా దక్షిణాదిలో కార్యాచరణ ఉండాలి. దేశంలో నియంత పాలన రాకూడదన్నదే నా ఉద్దేశం. దక్షిణాదికి బలం లేదని పెత్తనం చేస్తామంటే.. అది ఎంతకాలమో కొనసాగదు. జాతీయ పార్టీ అయినా, అన్యాయంపై మాట్లాడే స్వేచ్ఛ మాకుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలో నియోజకవర్గాల పునర్విభజనపై బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ఏదేదో మాట్లాడుతున్నారని.. తెలంగాణలో రాష్ట్రపతి పాలన పెడతామని ఆయన అంటున్నారని

మండిపడ్డారు. మరి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పెట్టరా? అంటూ ప్రశ్నించారు. నియోజకవర్గాల పునర్విభజనను 50 శాతం సీట్ల ప్రాతిపదికన చేస్తే దక్షిణ భారతదేశానికి అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ ఎంపీ లక్ష్మణ్ దీనిపై వితండవాదం చేస్తున్నారని ఆగ్రహించారు. 50 శాతం సీట్లు పెంచుతున్నామని చెప్పినా ఉత్తర భారతదేశానికి నేరుగా లాభం జరుగుతుందని ఆరోపించారు. యోజకవర్గాల పునర్విభజన జరిగితే సౌత్ ఇండియా అవసరం లేకుండా పోతుందని విమర్శించారు. ఇది పార్టీల సమస్య కాదని.. సౌత్ ఇండియా, ప్రజా సమస్యని చెప్పుకొచ్చారు. దక్షిణ భారత ప్రజల కోసం లక్ష్మణ్ రాజీనామా చేయాలని.. సౌత్, నార్త్ మధ్య అంతరం పెరగొద్దని హితవుపలికారు. తిరుగులేని పాలన వస్తే నియంతృత్వం వస్తుందని.. అది జరగటానికి వీల్లేదని తేల్చి చెప్పారు. దేశంలో బ్రూటల్ మెజార్టీ కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని.. బీజేపీ నాయకులు దీనిపై అవగాహన తెచ్చుకోవాలని హితవుపలికారు. బాగా పని చేస్తున్న సౌత్ ఇండియాను శిక్షించాలని చూస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వల్లే తనకు గుర్తింపు వచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ లేకపోతే తాను చేసిన మంచి పనులు ప్రజలకు తెలిసేవి కాదని చెప్పారు. రావణుడి చెడు వల్లే రాముడి గొప్పతనం తెలిసిందని చెప్పుకొచ్చారు. కేసీఆర్ విశ్రాంతి తీసుకొంటున్నారని అందరూ అంటున్నారని.. ఆయన్ను గృహ నిర్బంధం చేశారని తనకు అనుమానంగా ఉందన్నారు. రేపటి నుంచి రెండు రోజుల పాటు తాను కేరళలో ఎన్నికల ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. తనకు, కేసీఆర్‌కు పోలిక లేదని.. ఎన్నికల వేళ తాము ఏం చెప్పామో అదే చేస్తున్నట్లు తేల్చి చెప్పారు. కేసీఆర్ చెప్పిన దానికి చేసిన దానికి సంబంధం లేదని.. ఆయన ఉండటం వల్లే తనకు పేరొచ్చిందని ఎద్దేవా చేశారు. అన్ని పథకాలు కలిపితేనే ప్రజాపాలన అని, రైతులకు అవగాహన కల్పించడంలో మీడియా కీలకపాత్ర పోషించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మీడియా సామాజిక బాధ్యత తీసుకోవాలని సూచించారు. రూ.500ల గ్యాస్ విధానంలో ఎలాంటి మార్పులు లేవని గుడ్ న్యూస్ చెప్పారు. కేంద్రం సెస్ పేరుతో వసూలు చేస్తున్న డబ్బులు రాష్ట్రానికి ఇవ్వడం లేదని.. 34 శాతం మాత్రమే తిరిగి ఇస్తున్నారని మండిపడ్డారు. కేంద్రానికి నచ్చిన రాష్ట్రాలకు మాత్రమే సెస్ ఇస్తున్నారని ఆరోపించారు.

# ముంచుకొస్తున్న మంచినీటి సమస్య !

### కోటి ఎకరాల భూ ఆక్రమణకు టెండర్
### ముఖ్యమంత్రి, మంత్రుల భూ దందాకు సామాన్యుల బలి
### వట్టినాగులపల్లిలో బాధితులకు కెటిఆర్ పరామర్శ
### అండగా ఉంటామని హామీ

హైదరాబాద్,: సీఎం రేవంత్ రెడ్డి పలుకుబడిని అడ్డుపెట్టుకుని అడ్డగోలుగా భూములు గుంజుకుంటున్నారని కేటీఆర్ విమర్శించారు. భూమి బౌండరీలను మార్చే ప్రయత్నం చేశారని ఆరోపించారు. మహేశ్వరం నియోజకవర్గంలో వేల ఎకరాలు కబ్జా చేస్తున్నారని తెలిపారు. అధికారులను అడ్డుపెట్టుకుని అరాచకపర్వం చేపడుతున్నారని మండిపడ్డారు. కోటి ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో పెట్టారని అన్నారు. రంగారెడ్డి జిల్లా వట్టినాగులపల్లిలో కేటీఆర్ సహా, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పర్యటించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూ కబ్జా బాధితులను పరామర్శించారు. భూ కబ్జాలకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ పోరాడుతుందని బాధితులకు భరోసానిచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. వట్టనాగులపల్లిలో సతీశ్ షా కుటుంబం 60 ఏళ్లుగా ఉంటుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. రూ.1400 కోట్ల విలువ చేసే భూమిపై పొంగులేటి కన్ను పడిందని పేర్కొన్నారు. స్థలం ఇచ్చే ఉద్దేశం లేదని షా కుటుంబం తెలిపిందని అన్నారు. ఔటర్ రింగ్ రోడ్డులో మీ ల్యాండ్ పోయిందని బెదిరింపులకు గురి చేశారని చెప్పారు. ఓ అక్రమార్కున్ని అడ్డం పెట్టుకుని 27 ఎకరాల భూమిని గుంజుకునే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. జేసీబీలతో వచ్చి గోశాలను కూల్చేశారని.. కాంపౌండ్ వాల్ కూలగొట్టారని అన్నారు. సతీశ్ షాను ఇక్కడే సజీవంగా పాతిపెడతామని బెదిరించారని తెలిపారు. అజీబుల్లా ఖాన్ అనే సిన్సియర్ అధికారి వీరికి రక్షణ కల్పించారని పేర్కొన్నారు. తెల్లారే ఆ నిజాయితీ పోలీసు అధికారిని ట్రాన్స్‌ఫర్ చేశారని చెప్పారు. దశాబ్దాలుగా ఇక్కడే ఉంటున్నామని వట్టినాగులపల్లి బాధితుడు సతీశ్ షా తెలిపారు. 1968 నుంచి భూములను సాగు చేసుకుంటున్నామని పేర్కొన్నారు. పొంగులేటి హర్ష రెడ్డి వచ్చి రోడ్డుకు స్థలం ఇవ్వాలని అడిగాడని చెప్పారు. అందుకు నిరాకరించడంతో కొన్ని రోజుల తర్వాత శ్రీనివాస్ రెడ్డి వచ్చారని తెలిపారు. ఒక్క నోటీసు కూడా ఇవ్వకుండా మా భూమి సర్వే చేయించాడని అన్నారు. సర్వే నోటీసులను హైకోర్టు కూడా కొట్టివేసిందని పేర్కొన్నారు. మా మనుషులపై దాడులు చేసి గూండాలు బెదిరించారని తెలిపారు. హైకోర్టుకు వెళ్తే పోలీస్ ప్రొటెక్షన్ ఇవ్వాలని ఆదేశించిందని తెలిపారు.దీపావళి పండుగ తర్వాత నుంచి చాలా ఆందోళనగా ఉన్నామని వట్టినాగులపల్లి బాధితురాలు పల్లవి షా తెలిపారు. మా భూమి ఇవ్వాలని పొంగులేటి మనుషులు కోరినా నిరాకరించామని పేర్కొన్నారు. మేం 50 ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నాం.. మాకు వేరే జాగా వద్దని అన్నామని చెప్పారు. అక్కడిస్తాం.. ఇక్కడిస్తామని మమ్మల్ని ఎంతో మభ్యపెట్టారని తెలిపారు. కిలోమీటర్ ఉన్న కాంపౌండ్ వాల్‌ను రాత్రికి రాత్రే కూల్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశామని తెలిపారు. అదే రోజు రాత్రి 70 మంది గూండాలు వచ్చి మా గార్డులను బంధించారని వాపోయారు. మొబైల్స్ గుంజుకున్నారు..

తెల్లవారుజాము వరకు నిర్బంధించారని తెలిపారు. ఇక్కడి నుంచి వెళ్లకపోతే నరికిపారేస్తామని బెదిరించారని అన్నారు. మాకు అండగా ఉన్న పోలీసు అధికారిని ట్రాన్స్‌ఫర్ చేయించారని తెలిపారు. మాకు అనుకూలంగా హైకోర్టు ఆదేశాలు ఉన్నా కూడా విధ్వంసానికి పాల్పడ్డారని తెలిపారు.

# ఆళ్లకు హైకోర్టులో చుక్కెదురు

మొదటిపేజీ తరువాయి

అలాగే ఈ కేసులో ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఇచ్చిన ముందస్తు బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ ఆళ్ల రామకృష్ణారెడ్డి వేర్వేరుగా వ్యాజ్యాలను దాఖలు చేశారు. ఈ పిటిషన్లంటిపై హైకోర్టులో విచారణ జరిగింది. దాదాపు మూడు వారాల పాటు విచారణ జరిగిన అనంతరం సోమవారం ఉదయం ధర్మాసనం తీర్పు ఇచ్చింది. ఈ వ్యాజ్యాలన్నింటినీ కొట్టివేస్తూ హైకోర్టు తీర్పునిచ్చింది. అలాగే వ్యాజ్యాల విచారణార్హతపై కూడా ఇటీవల న్యాయస్థానంలో వాదనలు ముగిశాయి. ప్రభుత్వం తరఫున సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. ఇలాంటి పిటిషన్లకు విచారణార్హత లేదని సిద్దార్థ లూథ్రా వాదించారు. ఈ వాదనలు

# విశాఖ యువతి మౌనిక హత్య

మొదటిపేజీ తరువాయి

విశాఖపట్నం: విశాఖపట్నంలోని ఎల్.వి.నగర్‌లో దారుణ హత్యకు గురైన యువతి మౌనిక (29) కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. ప్రాథమిక విచారణలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. లాక్‌డౌన్ సమయంలో నిందితుడు చింతాడ రవీంద్రకు డేటింగ్ యాప్‌లో మౌనిక పరిచయమైనట్లు తెలిసింది. ఆమెకు రూ.3.50లక్షల ఇచ్చినట్లు రవీంద్ర తెలిపాడు. డబ్బు కోసం మౌనిక వేధించేదని.. హింస భరించలేకే ఆమెను హతమార్చినట్లు పోలీసులకు చెప్పాడు.

ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంటకు ఎల్.వి.నగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌కు మౌనికను రవీంద్ర పిలిచాడు. అక్కడికి వచ్చిన కాసేపటికే వారిద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఆ తర్వాత ఆమెను రవీంద్ర కిరాతకంగా హతమార్చాడు. హత్యకు ముందే గాజువాకలో కత్తులు కొనుగోలు చేశాడు. మౌనికను చంపిన తర్వాత రక్తపు మరకలు కడిగేశాడు. రక్తపు వాసన రాకుండా ఇంట్లో సెంటు కొట్టాడు. శరీర భాగాలను ముక్కలుగా చేసి ఫ్రిజ్‌లో పెట్టాడు. తల, ఆమె ఫోన్‌ను దారపాలెం తోటల్లో తగులబెట్టాడు. అనంతరం స్నేహితుడికి ఫోన్ చేసి హత్య విషయాన్ని చెప్పాడు. స్నేహితుడు హెచ్చరించడంతో గాజువాక పోలీసులకు రవీంద్ర లొంగిపోయాడు.

# నర్సీపట్నంలో గ్యాస్ కొరత లేకుండా చర్యలు:

మొదటిపేజీ తరువాయి

వంట గ్యాస్ కోసం ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. జాతరకు సుమారు లక్ష మంది భక్తులు తరలివస్తారని అంచనా వేశారు. ఈ నేపథ్యంలో గ్యాస్ అవసరాలను గుర్తించి అధికారులతో మాట్లాడి ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. ఇప్పటివరకు సుమారు 4,500 గ్యాస్ సిలిండర్లను నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలోకి తెప్పించామని, మరో 2,000 సిలిండర్లు కూడా అందుబాటులోకి వచ్చాయన్నారు. ప్రజలకు గ్యాస్ సమస్య ఉంటే నేరుగా ఎమ్మార్వోను కలిసి పరిష్కరించుకోవచ్చన్నారు.

# సహజీవన జంటలకు కుటుంబ హోదా:

మొదటిపేజీ తరువాయి

దేశవ్యాప్తంగా జనగణనకు సిద్ధమైన కేంద్ర ప్రభుత్వం జనాభా లెక్కలకు సంబంధించిన నిబంధనల్లో కీలక మార్పులు చేసింది. ఈసారి సహజీవన జంటలకు కుటుంబ హోదా ఇవ్వనున్నట్లు కేంద్రం ప్రకటించింది. చాలాకాలంగా కలిసి ఉంటున్న వారిని ఇకపై ఒకే కుటుంబంగా గుర్తించాలని నిర్ణయం తీసుకున్నట్టు తాజాగా వెల్లడించింది. ఈమేరకు జనగణన ప్రక్రియ వివరాలను రిజిస్ట్రార్ జనరల్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ సోమవారం మీడియాకు వివరించారు.

ప్రస్తుతం జరగనుంది 16వ జనగణన. ఈ ప్రక్రియ ఏప్రిల్ 1 నుంచి ప్రారంభం కానుంది. రెండు దశల్లో దీన్ని చేపట్టనున్నారు. తొలిదశలో భాగంగా గృహ గణన చేపట్టనున్నారు. మొబైల్ యాప్ ద్వారా అధికారులు ఇంటింటికీ వెళ్లి ఇళ్ల వివరాలు సేకరించనున్నారు. రెండో దశలో జనాభా లెక్కల సేకరణ ఉంటుంది. దీన్ని వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ప్రారంభించనున్నారు. ఇంతకుముందెప్పుడూ లేనివిధంగా తొలిసారి స్వయంగా వివరాల నమోదుకు కేంద్రం ఈసారి అవకాశం కల్పించింది. జనగణన కోసం 33 ప్రశ్నలతో ఓ ప్రశ్నావళిని రూపొందించారు.

ఇంటి యజమాని, అతని వ్యక్తిగత వివరాలు, కులం, కమ్యూనిటీకి సంబంధించిన వివరాలను ఇవ్వాల్సిఉంటుంది. ఇంట్లో ఉండే వారి సంఖ్య, వారి వయసు వంటి వివరాలను అధికారులు నమోదు చేసుకుంటారు. ఫోన్లు, ఇంటర్నెట్, వాహనాలు (సైకిల్, స్కూటర్, బైక్, కారు, జీపు, వ్యాన్), గృహోపకరణాలు (రేడియో, టీవీ) వంటి వస్తువుల యాజమాన్యం గురించి ప్రజలను అడుగుతారు. తృణధాన్యాల వినియోగం, తాగునీటి వనరులు, మరుగుదొడ్ల వాడకం, వంటగది సౌకర్యాలు, వంటకు వినియోగించే ఇంధనం వివరాలు సేకరిస్తారు. ఈ వివరాలన్నీ అత్యంత గోప్యంగా ఉంటాయని రిజిస్ట్రార్ జనరల్ వెల్లడించారు. మన దేశంలో సాధారణంగా పదేళ్లకోసారి జనగణన నిర్వహిస్తారు. ఆఖరిగా 2011లో జనాభా లెక్కలు సేకరించారు. కొవిడ్ కారణంగా 2021లో నిర్వహించాల్సిన జనగణనకు ఆటంకం ఏర్పడింది.

# ఏపీ, తెలంగాణ ఇంటర్ ఫలితాలు ఎప్పుడంటే?

మొదటిపేజీ తరువాయి

గేట్ ఫలితాలు విడుదల.. రిజల్ట్స్ కోసం క్లిక్ చేయండి

మరోవైపు, తెలంగాణలో ఇంటర్ పరీక్షా ఫలితాలను ఏప్రిల్ 10లోపు విడుదల చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. వీలైతే ఏప్రిల్ 6నే విడుదల చేయాలని భావిస్తున్నారు. జూన్ 1 నుంచి జూనియర్ కళాశాలలు పునఃప్రారంభం కానున్నందున ఫెయిలైన విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించి మే 31 నాటికి ఫలితాలు ఇవ్వాలని నిర్దేశించుకున్నారు. ఈ క్రమంలో మార్చి 15 నుంచే మూల్యాంకనం ప్రక్రియను ప్రారంభించి ముమ్మరంగా కొనసాగిస్తున్నారు.

# చివరి ధాన్యం గింజ వరకు కొంటాం

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా పొలాల్లో రైతులతో మాట్లాడి వారి సమస్యలు, ఇబ్బందులు తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. రైతుల నుంచి ధాన్యాన్ని మొత్తం కొనుగోలు చేయాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పక్కా ఏర్పాట్లు చేసిందని వెల్లడించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నెల్లూరు జిల్లా నుంచి ఒక్క ధాన్యం గింజ కూడా కొనుగోలు చేయలేదని, రైతులను నిలువునా ముంచేశారని ఆయన ఆరోపించారు. ధాన్యం కొనుగోలు విషయంలో అప్పటి నేతలు గోల్‌మాల్ చేసి రూ.82 కోట్ల మేర అవినీతి చేశారని మంత్రి నాదెండ్ల మనోహర్ ఆరోపించారు. ప్రస్తుతం ధాన్యం కొనుగోలు వ్యవస్థలను క్రమబద్ధీకరిస్తున్నామని చెప్పారు. గత ఏడాది 75 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించగా, ఈ ఏడాది

# తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమ్మకు అక్షరమాల కార్యక్రమం



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన " అమ్మకు అక్షరమాల" కార్యక్రమంలో భాగంగా అశ్వరావుపేట మండలం కొత్త మామిళ్ల వారి గూడెం. గ్రామపంచాయతీ పరిధిలో. పాత మామిళ్ల వారి గూడెం. కోర్సగూడెం ఉసర్లగూడెం. బోరేలగుట్ట కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక పరీక్షలను అశ్వరావుపేట ఏ పి యం దేవామణి గారు క్షేత్రస్థాయిలో సందర్శించి, పరిశీలించారు.అక్షరాస్యత శాతాన్ని పెంచే లక్ష్యంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ పరీక్షా కేంద్రాన్ని అశ్వరావుపేట ఏపిఎం దేవమణి సందర్శించి, పరీక్షలు జరుగుతున్న తీరును మామిళ్ల వారి గూడెం గ్రామ దీపిక ను బుజ్జిని అడిగి తెలుసుకున్నారు. అమ్మకు అక్షరమాల కార్యక్రమం ద్వారా చదువు లేని పెద్దలకు 15 సంవత్సరాలు వయసు పైబడిన వారు ముఖ్యముగా మహిళలు గ్రామీణ మరియు వెనుకబడిన వర్గాలు వారికి చదువు నేర్పించే సమాజంలో వారు స్వయం సమర్థులుగా ఏ దగటానికి సహాయం చేయడమే ప్రధాన ఉద్దేశం :చదువు వల్ల ప్రయోజనాలు: సంతకము చేయటము పుస్తకాలు చదవగలటం రోజువారి లెక్కలు చేసుకోవడం.ఇతరులు నుండి మోసపోకుండా ఉండటానికి చదివే ఆధారం చదువుకోవడానికి వయసుతో సంబంధం లేదని, అక్షరాస్యత సాధించడం ద్వారానే తెలివితేటలు లోకజ్ఞానం మహిళా సాధికారత సాధ్యమవుతుందని పరీక్ష రాస్తున్న తల్లులను వయోజనులను మహిళలు ఏపిఎం అభినందించారు. ప్రతి ఇంటా ఒక చదువుకున్న తల్లి ఉండాలనే సంకల్పంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని .పరీక్షా కేంద్రంలో తల్లులకు వయోజనులకు వృద్ధులకు . విద్య పరీక్ష నిర్వహించారు ?"అక్షరం అనేది ఒక ఆయుధం. మన తల్లులు అక్షరాస్యులుగా మారడం వల్ల రాబోయే భవ్య తరాలకు మెరుగైన భవిష్యత్తు అందుతుంది తల్లిదండ్రుల చదువుకొని ఉంటే ఆ కుటుంబం కాక గ్రామం బాగుపడుద్ది వారి పిల్లలు చదువు పట్ల అభివృద్ధి చెందుతారు ఆమె తెలియజేశారు ఈ కార్యక్రమంలో మామిళ్ళ వారి గూడెం గ్రామ దీపిక (వి ఓ ఏ ) పెదపూడి. బుజ్జి వెలుగు కోఆర్డినేటర్ (సిసి) సత్యనారాయణ వయోజన విద్యార్థులు వృద్ధులు మహిళలు తల్లులు పాల్గొన్నారు

# ఉప్పునుంతల యువకుడిని సన్మానించిన సర్వీస్ నౌ ప్రతినిధులు

**యునీటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపిన రణధీర్**




నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండలం బికే ఉప్పునుంతల గ్రామంలో సర్వీస్ నౌ మరియు యునీటెడ్ వే హైదరాబాద్ సంస్థ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఆ అభివృద్ధిలో భాగంగా గ్రామ ప్రజలకు ఫిల్టర్ వాటర్ కోసం ఆర్వో ప్లాంట్, నీటి సదుపాయం కోసం ఒక మినీ ట్యాంక్ మరియు ఒక బోర్ వేయించడం జరిగింది. గ్రామంలో 25 సోలార్ స్ట్రీట్ లైట్స్, అదేవిధంగా 70 చెంచు కుటుంబాలకు రెండు నెలల సరుకులు, ఉపాధి హామీ పనిచేసే 70 మంది కూలీలకు వ్యవసాయ పనిముట్లు, గ్రామంలో శిథిలావస్థలో ఉన్న స్కూల్ ని పునర్నిర్మాణం, యువకులకు ఉపాధి కోసం కిరాణం, కటింగ్ షాప్, టిఫిన్ సెంటర్, మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ చేయడం జరిగింది. గ్రామాభివృద్ధికి సహకరించిన రణధీర్ కి యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంస్థ మరియు సర్వీస్ నౌ ప్రతినిధులు భరత్,జజూా రేఖా, ప్రియాంక, పల్లవి, రాములు, సతీష్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దేశవత్ లలిత, ఉప సర్పంచ్ మహమ్మద్ గౌస్, పంచాయతీ కార్యదర్శి గణేష్ పాల్గొన్నారు.

# ఫ్లెక్సీలను తొలగించండి పర్యావరణాన్ని కాపాడండి

**– జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్**



కొత్తగూడెం కలెక్టరేట్: కొత్తగూడెం నియోజకవర్గంలో గత కొంతకాలంగా అనుమతులు లేకుండా విచ్చలవిడిగా ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలను తొలగించాలని జై భీమ్ రావు భారత్ పార్టీ(జేబీపీ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ గ్రీవెన్స్ డే ని పురస్కరించుకుని సోమవారం జిల్లా కలెక్టర్ అంకిత్ కు ఫిర్యాదు చేశారు.ఈ సంధర్భంగా కామేష్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంతో పాటు జాతీయ ప్రధాన రహదారుల సెంటర్ పోల్స్ కు అడ్డగోలుగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి ప్రమాదాలకు కారణం అవుతున్న ఫ్లెక్సీ షాపుల యజమానులపై చర్యలు తీసుకోవాలని,విచ్చలవిడిగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం మూలంగా పర్యావరణానికి హాని కలిగించే విధంగా వారి చర్యలు ఉన్నాయన్నారు.కొత్తగూడెం కార్పొరేషన్ తో పాటు జిల్లాలోని వివిధ మండలాలలో ఏ విధమైన అనుమతులు లేకుండా పెద్ద పెద్ద హోర్డింగులను ఏర్పాటు చేసినా సంబంధిత మున్సిపల్ మరియు పంచాయితీ సిబ్బంది చర్యలు తీసుకోకుండా చూసి చూడనట్టు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తుందన్నారు.దేశవ్యాప్తంగా ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉన్నప్పటికీ ఏ విధమైన అనుమతులు లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్న సదరు ఫ్లెక్సీ ప్రింటింగ్ యజమానులపై చర్యలు తీసుకుని ప్రకృతిని కాపాడాలని కోరారు.గతంలో ఇక్కడ కలెక్టర్ గా విధులు నిర్వహించిన అనుదీప్ జిల్లా అంతటా ఫ్లెక్సీ హోర్డింగ్ లను తొలగించిన విషయాన్ని ఈసందర్భంగా గుర్తు చేశారు.తక్షణమే స్పందించి కొత్తగూడెం కార్పొరేషన్ మరియు జిల్లాలోని వివిధ మండలాలలో పర్యావరణానికి హాని కలిగించే విధంగా ప్లాస్టిక్ తో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్న వారిపై వెంటనే చర్యలు తీసుకొని అనుమతులకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన హోర్డింగులను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గంధం మల్లికార్జున రావు,జిల్లా ప్రధాన కార్యదర్శి మలోత్ వీరు నాయక్,అసెంబ్లీ అధ్యక్షుడు నాగుల రవికుమార్,కొండా విజయభాస్కర్,ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

# అడుగుల భజన పోటీలలో మొదటి బహుమతి పొందిన మాచారం బృందం

**– 20,000 నగదుతో పాటు టీం ను సన్మానించడం జరిగింది**



నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం ఉప్పునుంతల మండలంలో శ్రీరామనవమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ వేడుకల సందర్భంగా గ్రామంలోని ఆలయ ప్రాంగణంలో అనేక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అడుగుల భజన పోటీలలో అమ్రాబాద్ మండలం మాచారం గ్రామానికి చెందిన భజన బృందం మొదటి బహుమతి 20వేల రూపాయల నగదు గెలుపొందారు. భజన పోటీల్లో గెలుపొందిన టీం ను నిర్వాహక కమిటీ సభ్యులు సన్మానించడం జరిగింది. మొదటి బహుమతి గెలుపొందినందుకు మాచారం గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సాంస్కృతిక కళా నైపుణ్యాన్ని మర్చిపోకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ భజన పోటీలను నిర్వహించినట్లు నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు. అడుగుల భజన పోటీలలో పాల్గొన్న యువకులను మాచారం గ్రామ పెద్దలు అభినందించారు.

# బొమ్మనపల్లి వెళ్లే ప్రధాన రహదారిపై కల్వర్టు పనుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న కాంట్రాక్టర్

**– హెచ్చరిక బోర్డులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు**

నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట మండల పరిధిలోని బొమ్మనపల్లి వెళ్లే ప్రధాన రహదారిపై నక్కమర్రి వాగు వద్ద చేదురుబావి తండా సమీపంలో కల్వర్టు నిర్మాణ పనులు ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల అక్కడ ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల రెండు ప్రమాదాలు చోటు చేసుకోగా ఆదివారం రాత్రి మరో ప్రమాదం చోటుచేసుకుంది. గుండమోని బచ్చలయ్య తన భార్యతో కలిసి ద్విచక్ర వాహనంపై అచ్చంపేట నుండి బొమ్మనపల్లి వెళుతుండగా రహదారి సరిగ్గా ఉందని భావించి కల్వర్టు కోసం తవ్విన గుంతను గమనించకపోవడంతో వాహనం అందులో పడిపోయింది. ఈ ప్రమాదంలో అతని భార్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. సమయానికి అటుగా వెళుతున్న బీసీఎఫ్ స్టేట్ సెక్రటరీ డాక్టర్ నారమోని నరేష్ యాదవ్ 108కు సమాచారం అందించారు. గాయపడిన వారిని వెంటనే ఆసుపత్రికి తరలించారు.



ఇప్పటికే పలుమార్లు ప్రమాదాలు జరిగినప్పటికీ కాంట్రాక్టర్ ఎలాంటి భద్రత చర్యలు తీసుకోకపోవడం పట్ల స్థానికులు మండిపడుతున్నారు. ఈ ఘటన కు కారణమైనటువంటి కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు స్పందించి కల్వర్టు నిర్మాణ ప్రదేశంలో తగిన భద్రతా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# చందాపూర్ గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలి

**– రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న స్థానికులు**



నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం చందాపూర్ గ్రామానికి వెళ్లే దారిలో దాదాపు 6 నెలల క్రితం కంకర పరిచిన కాంట్రాక్టర్ ఇప్పటివరకు బీటీ రోడ్డు వేయడం మరిచిపోయారు. బీటీ రోడ్డు వేయకపోవడంతో కంకర తేలి పలుచోట్ల ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో కంకర తేలి వాహనదారులు మరియు స్థానికులు ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో అయితే రోడ్డు సరిగ్గా కనిపించకపోవడంతో వాహనదారులు మరింత ఇబ్బందులకు గురవుతున్నారని గ్రామస్తులు పేర్కొన్నారు. ఎలాంటి ప్రమాదాలు తలెత్తక ముందుకే పై అధికారులు వెంటనే స్పందించి పెండింగ్ లో ఉన్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని గ్రామ సర్పంచ్, నాయకులు, కార్యకర్తలు, యువకులు, గ్రామస్తులు తదితరులు కోరుతున్నారు.

# క్వారీలో పడి మృతిచెందిన చిన్నారుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి..

**– ఆధార్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంటే కేశవ గౌడ్..**





సత్తుపల్లి మండలంలోని ఎన్టీఆర్ కాలనీలో క్వారీలో పడి మృతి చెందిన చిన్నారుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని ఆధార్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు కంటే కేశవ గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం మృతి చెందిన చిన్నారుల కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి వారి మృతికి గల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇది ముమ్మాటికి ప్రభుత్వ హత్యానని ఆరోపించారు. ఊరు సమీపంలో అక్రమంగా క్వారీలకు అనుమతులు ఇచ్చి చిన్నారుల ప్రాణాలను బలి తీసుకోవడం సరైనది కాదన్నారు. ఈ క్వారీలకు అనుమతులు ఇచ్చిన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మృతుల కుటుంబాలకు రెండు కోట్ల ఎక్స్గ్రేషియా తో పాటు ఆ కుటుంబంలోని సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఆ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోలేని పక్షంలో తమ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పలువురు ఆధార్ పార్టీ తుంగ హరికృష్ణ.నాయకులు ఉన్నారు.

# మద్దిమడుగులో అంగరంగ వైభవంగా హనుమాన్ జయంతి ఏర్పాట్లు పూర్తి

**భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలనిద ఆలయ చైర్మన్**



నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం పదరా మండలం మద్దిమడుగు క్షేత్రంలో శ్రీ పబ్బతి ఆంజనేయ స్వామి జయంతి వేడుకలు మార్చి 31 నుంచి ఏప్రిల్ రెండో తేదీ వరకు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. మూడు రోజులపాటు రుద్రయాగ మహోత్సవాలు అదేవిధంగా ఏప్రిల్ 2 వ తేదీన హనుమాన్ గాయత్రి మహా యజ్ఞం నిర్వహించనున్నారని ఆలయ ప్రధాన అర్చకులు తెలిపారు. ఈ జయంతి వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆంజనేయ స్వామి వారి కృపకు పాత్రులు కావాలని దేవస్థాన కమిటీ చైర్మన్ దేశవత్ రాములు మరియు ఈవో నరసింహులు పిలుపునిచ్చారు. హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా భక్తుల కోసం అన్ని రకాల సదుపాయాలను ఏర్పాటు చేసినట్లు ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు. జయంతి వేడుకల్లో నియోజకవర్గ ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఈకాలం
THE HONEST TELUGU DAILY
31-03-2026

# శ్రీశైలం ఎడమ గట్టు భూగర్భ జల కేంద్రంలో రికార్డు స్థాయి విద్యుత్ ఉత్పత్తి

**- హర్షం వ్యక్తం చేసిన జెన్ కో సీఈ కే.వీ సత్యనారాయణ**




నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండలం పాతాళ గంగ వద్ద ఉన్న శ్రీశైలం అటు భూగర్భ జల విద్యుత్ కేంద్రం అరుదైన మైలురాయిని అధిగమించింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను శ్రీశైలం ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రం రికార్డు స్థాయిలో 2590.09 మిలియన్ యూనిట్ల విద్యుత్ ను అతి చేసి సరికొత్త రికార్డు సృష్టించిందని జన్కోస్ ఈ కేవీ సత్యనారాయణ తెలిపారు. జపాన్ సాంకేతిక పరిజ్ఞానంతో నడుస్తున్న ఈ జల విద్యుత్ కేంద్రంలోని ఆరు యూనిట్లు పూర్తి సామర్థ్యంతో పని చేయడం వల్లే ఇది సాధ్యమైందని ఆయన తెలిపారు. రికార్డు స్థాయిలో విద్యుత్ను ఉత్పత్తి చేసి సరికొత్త రికార్డు సృష్టించినందుకు జెన్ కో సీఈ కె.వీ సత్యనారాయణ ఆనందం వ్యక్తం చేశారు.

# గంజాయి కేసులలో నిందితుడిపై పీడీయాక్ట్ నమోదు చేసిన బూర్గంపాడు పోలీసులు



బూర్గంపాడు మండలం సారపాక గ్రామానికి చెందిన షేక్.మున్వర్ వా/శీ.షఫీ గంజాయి అక్రమ రవాణా చేస్తున్నందుకు 2024,2025 సంవత్సరాలలో బూర్గంపాడు పోలీస్ స్టేషన్ నందు రెండు (02) కేసులు,2024 లో లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్ నందు (01) కేసు, 2024లో ఏడుళ్ల బయ్యారం పోలీస్ స్టేషన్లో (01) కేసు నమోదు చేయడం జరిగింది. చివరిగా 2025 ఏప్రిల్ నెలలో దుండిగల్ పిఎస్ లో 98 కేజీల గంజాయిని సరఫరా చేస్తూ దొరకగాఅక్కడ కూడా కేసు నమోదు చేయడం జరిగింది. ఈ ఐదు కేసులలో షేక్.మున్వర్ మొత్తం 287 కేజీల గంజాయిను సరఫరా చేస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నందున అతనిపై పిట్ ఎన్ డి పి ఎస్ యాక్ట్ (పీడియాక్ట్) కొరకు పాల్వంచ డిఎస్పీ ఆర్ సతీష్ కుమార్ సూచనలతో సీఐ కే .సతీష్ ప్రతిపాదించగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పర్యవేక్షణలో ప్రతిపాదిత ఆధారాలను క్షుణ్ణంగా పరిశీలించి సీఐడి అడిషనల్ డీజిపి చారు సిన్హా ఐపిఎస్ 16.02.2026 నాడు డిటెన్షన్ ఆర్డర్ (నిర్భంద ఉత్తర్వులు) ను జారీ చేయగా 18.02.2026 నాడు డిటెన్షన్ ఆర్డర్ ప్రతులను షేక్.మున్వర్ కు అందజేసి చేసి అతనిని చర్లపల్లి సెంట్రల్ జైలుకు తరలించడం జరిగింది. 17.03.2026 తేదీన అడ్వైజరీ బోర్డు (సలహా మండలి) షేక్.మున్వర్ పై వచ్చిన నిర్భంద ఉత్తర్వులపై విచారణ జరిపి భౌతిక,సాంకేతిక ఆధారాలను పరిశీలించి, ( యాక్ట్) యాక్ట్ ను సమర్థిస్తూ సంవత్సర కాలం చర్లపల్లి జైల్లో నిర్బంధించాలని ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. ప్రస్తుత సమాజంలో ప్రజల ఆరోగ్యమే ముఖ్యమని,ప్రజల ఆరోగ్యంపై తీవ్ర దుష్ప్రభావాన్ని చూపించే గంజాయి లాంటి మాదక ద్రవ్యాలను సేవించినా,సరఫరా(రవాణా) చేయడం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని,వారిపై ఉన్నతాధికారుల ఆదేశాలతో పీడీయాక్ట్ లను నమోదు చేయడం జరుగుతుందని సీఐ సతీష్ తెలిపారు. అంతేకాకుండా పట్టుబడిన నిందితులు గంజాయి అక్రమ రవాణా ద్వారా సంపాదించిన ఆస్తులను కూడా కోర్టు ఉత్తర్వులతో జప్తు చేయడం జరుగుతుందని తెలియజేశారు.

# తెలంగాణ అమర్నాథ్ యాత్ర (సలేశ్వరం) వైభవం.... అడవిలో వెలసిన ఆధ్యాత్మిక లోకం

**- సలేశ్వర క్షేత్రానికి కాలభైరవుడు క్షేత్రపాలకుడు అని వివరణ**



నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం నల్లమల్ల కొండల్లో కొలువైన సలేశ్వరం మల్లేశ్వరుని జాతర ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంటుంది. రాతి గుహల మధ్య జలపాతాల చెంత వెలసిన శివలింగాన్ని దర్శించుకోవడానికి భక్తులు కార్య నడకన వెళతారు. సుమారు పది కిలోమీటర్లు రా మీరా కఠినమైన కొండ మార్గంలో ప్రయాణించి ముందుగా సలేశ్వరా కేత్రానికి క్షేత్రపాలకుడుగా ఉన్నటువంటి కాలభైరవుడిని దర్శించుకుని ఆ తర్వాత లింగమయ్యను దర్శించుకోవడం జరుగుతుంది. మూడు రోజులపాటు ఈ సలేశ్వరం లింగమయ్య జాతర వేడుకలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. జాతర కోసం నాగర్ కర్నూల్ జిల్లా నుండి 25 ప్రత్యేక బస్సు సర్వీసులు రాకపోకలు సాగించనున్నాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపను పొందాలని ఆలయ ప్రధాన అర్చకుడు బాల గురువయ్య పిలుపునిచ్చారు.

# అత్యవసర సమయంలో రక్తదానం చేసిన నవీన్ రెడ్డి..

**-జిల్లా రక్తదాతల సేవా సమితి నిర్వాహకులు బోనగిరి శివకుమార్ ముదాం శ్రీధర్ పటేల్**

కామారెడ్డి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నమల్లారెడ్డి గ్రామానికి చెందిన జ్యోతి అనే పేషంట్ కి ఏ నెగెటివ్ రక్తం అవసరం కావడంతో పేషంట్ కుటుంబసభ్యులు కామారెడ్డి జిల్లా రక్తదాతల సేవా సమితి నిర్వాహకులను సంప్రదించడంతో ఒక్క ఫోన్ కాల్ తో వెంటనే స్పందించిన రాజంపేట్ మండలకేంద్రానికి చెందిన నవీన్ రెడ్డి ఒక ప్రాణాన్ని కాపాడాలనే ఉద్దేశంతో వెంటనే వచ్చి రక్తం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సేవా సమితి నిర్వాహకులు ముదాం శ్రీధర్ పటేల్ మాట్లాడుతూ.రక్తం దానం చేస్తే మళ్లీ రక్తం వస్తుంది కానీ, రక్తం అందక పోయిన ప్రాణం తిరిగి రాదు.మనం చేసే రక్తదానం వలన వెలకట్టలేని విలువైన ప్రాణం రక్షించబడుతుంది యువత మానవత్వంతో స్వచ్ఛంద



రక్తదానానికి ముందుకు వచ్చి ప్రాణదాతలు కావాలని తెలుపడం జరిగింది. ఈ సందర్భంగా ఒక్క ఫోన్ కాల్ చేయగానే వచ్చి రక్తదానం చేసిన నవీన్ రెడ్డి కి జిల్లా రక్తధాతల సేవా సమితి నిర్వాహకులు బోనగిరి శివకుమార్, ముదాం శ్రీధర్ పటేల్ కృతజ్ఞతలు తెలిపారు . ఈ కార్యక్రమంలో పేషంట్ కుటుంబసభ్యులు, కెబిఎస్ బ్లడ్ సెంటర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# అచ్చంపేట పట్టణంలో ఏప్రిల్ 3 తేదీన భారీ "హిందూ సమ్మేళనం"

**అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరిన హిందూ సమ్మేళన కార్యకర్తలు**



నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట నియోజకవర్గం లో ఏప్రిల్ మూడవ తేదీన భారీ "హిందూ సమ్మేళనం" కార్యక్రమం నిర్వహించనున్నారు. హిందూ సమాజమంతా ఏకతాటిపైకి రావాలని ప్రధాన లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారని హిందూ సమ్మేళన కార్యకర్తలు తెలిపారు. అచ్చంపేట పట్టణ కేంద్రంలోని చంద్రారెడ్డి గార్డెన్స్ ఫంక్షన్ హాల్లో శు క్రవారం ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరుతూ సాయి నగర్ కాలనీ హిందూ సమ్మేళన కార్యకర్తలు ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. హిందూ బంధువులందరూ పెద్ద సంఖ్యలో ఈ సమ్మేళనంలో పాల్గొని హిందూ ధర్మం గొప్పతనాన్ని తెలుసుకొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యువత పిలుపునిచ్చారు.

# సిర్సపల్లి - హుజురాబాద్ సరిహద్దు డంప్ యార్డ్ నిలిపివేత తీర్మానం

సిర్సపల్లి హుజురాబాద్ సరిహద్దులో ప్రతిపాదిత డంప్ యార్డ్ నిర్మాణంపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్న నేపథ్యంలో మున్సిపల్ సాధారణ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ భద్రతకు ముప్పుగా మారే ఈ ప్రాజెక్టును తక్షణం నిలిపివేయాలని సభ్యులు గట్టిగా



పట్టుబట్టారు. సమావేశంలో డంప్ యార్డ్ నిర్మాణాన్ని అడ్డుకోవాలనే అంశాన్ని తొలి తీర్మానంగా ప్రవేశపెట్టగా, చైర్మన్, వైస్ చైర్మన్తో పాటు కౌన్సిలర్లు ఏకగ్రీవంగా మద్దతు తెలిపారు. దీంతో డంప్ యార్డ్ నిర్మాణాన్ని నిలిపివేయాలని అధికారికంగా తీర్మానం ఆమోదించారు. ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం, పర్యావరణ కాలుష్యం, భవిష్యత్ తరాల సంక్షేమం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు సభ్యులు తెలిపారు. ప్రజాభిప్రాయాన్ని గౌరవిస్తూ మున్సిపల్ మండలి ఈ నిర్ణయం తీసుకోవడం విశేషంగా భావిస్తున్నారు. ఈ తీర్మానం పట్ల హుజురాబాద్ ప్రాంత ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తూ, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఎన్ పి ఆర్ డి క్యాలెండర్ ను ఆవిష్కరణ చేసిన జహీరాబాద్ డిఎస్పి.



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన 2026 క్యాలెండర్ ను జహీరాబాద్ డీఎస్పీ కార్యాలయంలో సైదా నాయక్ చే ఆవిష్కరణ చేయడం జరిగింది .ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ వికలాంగులను అన్ని రంఘాల్లో రాణించాలని ఆయన అభిప్రాయపడ్డారు , వికలాంగులపై అక్రమంగా దాడులు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డిఎస్పి తెలిపారు వారి ఆస్తులపైన గాని దాడి చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకలను వికలాంగులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా జాతీయ వికలాంగుల హక్కుల వేదిక ప్రధనా కార్యదర్శి ,కొన్నింటి. నర్సింలు సీనియర్ నాయకులు ఐమద్, మొగుడంపల్లి మండల అధ్యక్షులు రాజకుమారు జహీరాబాద్ ఎన్ పి ఆర్ డి అధ్యక్షుడు మహమ్మద్ వాజిద్ ఉపాధ్యక్షులు మచ్చెందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరవ తరగతి విద్యార్థినికి ఆర్టీసీ ఉద్యోగం ఉందన్న కారణంతో.... రేషన్ కట్

**- సాంకేతిక లోపం వల్ల జరిగే ఉంటుందని తెలిపిన అధికారులు**

నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలో రేషన్ కార్డుల ఎరువేతలు అధికారుల అత్యుత్సాహం సామాన్యులకు శాపంగా మారింది. వరాల్లోకి వెళితే అచ్చంపేట మండలం ఘనపూర్ గ్రామానికి చెందిన బొడ్డుపల్లి మల్లేష్, లిఖిత బియ్యం కోసం రేషన్ షాప్ కి వెళ్లగా కార్డు రద్దయిందని తెలిసింది. రద్దవడానికి కారణమేంటని విచారించగా ఇంట్లోని ఆరవ తరగతి విద్యార్థినికి ఆర్టీసీ ఉద్యోగం ఉందానే నేపంతో కార్డును తొలగించారు. ఆరవ తరగతి చదివే విద్యార్థినికి ఉద్యోగం



ఎలా సాధ్యమని ఆయన వాపోతున్నాడు.

రద్దవడానికి సాంకేతిక లోపం అని అధికారులు చెప్పారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే తన కార్డు రద్దు అయిందని అధికారులు స్పందించి తన రేషన్ కార్డు వెంటనే పునరుద్ధరించాలని ఆయన కోరారు. ఇందుకు కారణమైన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

# ఐనవోలు మండల నూతన కమిటీ ఎంపికపై సమావేశం

**- డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి**

హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఆధ్వర్యంలో ఐనవోలు మండల నూతన కమిటీల ఎంపికపై అబ్బర్వర్లతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది హనుమకొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యం - ఐనవోలు మండల నూతన కమిటీల ఎంపికపై కసరత్తు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ ) ఆదేశాల మేరకు, హనుమకొండ జిల్లా వ్యాప్తంగా పార్టీని క్షేత్రస్థాయి నుంచి పటిష్టం చేసేందుకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి శ్రీకారం చుట్టారు. ఈ ప్రక్రియలో భాగంగా పాత కమిటీలను రద్దు చేసి, పారదర్శకంగా నూతన కమిటీలను ఎన్నుకునేందుకు నియమించబడిన అబ్సర్వర్లు కుందూర్ వెంకట్ రెడ్డి, పింగిలి వెంకట్ రెడ్డి, బిల్లా ఉదయ్ రెడ్డి, మదన్ గౌడ్, పి. సారంగపాణితో కలిసి సోమవారం వర్ధన్నపేట నియోజకవర్గం, ఐనవోలు మండల నాయకులతో మ్యాంగో ఫార్మ్ స్టే రిసార్ట్, ఐనవోలులో స్థానిక శాసనసభ్యులు కె.ఆర్.నాగరాజు ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలలో బిజీగా ఉన్న నేపథ్యంలో, వారి సూచనల మేరకు మరియు వారికి పూర్తి సమాచారం అందించి ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పార్టీ పటిష్టత కోసం ఐనవోలు మండల స్థాయి కమిటీలను పారదర్శకంగా, క్రియాశీలక కార్యకర్తలతో భర్తీ చేయడంపై అబ్సర్వర్లతో కలిసి లోతుగా చర్చించి



ఆశావాహుళ నుండి మండల కమిటీకి 51 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సమావేశంలో జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు, మండల ముఖ్య నేతలు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

Eekalam News, printed and published by Devender Nukala, eekalam publications, printed at sunday printing press, h.no.361, bhagyalaxmi colony, medchal malkaj-giri, telangana 500054. Editor : Devender Nukala. eekalamnews@gmail.com, RNI(PRGI) No.TGTEL/25/A3149